సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 23 । అక్టోబర్ । 2022

మన్యంలో టీడీపీకి చరమగీతం IIలో

మన్యంలో టీడీపీకి చరమగీతం తప్పదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. టీడీపీకి చెందిన పలువురు ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.





నిధుల గోల్‌మాల్‌పై కొనసాగిన విచారణ IIలో

న్యూస్‌రీల్

బస్సుల మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ జోనల్ ఇంజినీర్



బస్సులో లోపల పరిశీలిస్తున్న అప్పలనాయుడు

నర్సీపట్నం: బస్సుల మెయింటెనెన్స్‌పై ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ జోనల్ ఇంజినీర్(మెకానికల్) బి.అప్పలనాయుడు సూచించారు. శనివారం ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేసి, బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యారేజ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రైవర్లకు అనువుగా బస్సులు ఉండేలా చూడాలన్నారు. బస్సు కండిషన్‌పైనే సమయ పాలన ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆయిల్ పొదుపు ద్వారా డిపో ఆదాయాన్ని పెంచాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఇంజినీర్లు ఆచారి, రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు ఉన్నారు.

లిక్విడ్ గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

చింతపల్లి రూరల్: మండలంలోని లోతుగెడ్డ వంతెన వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ముగ్గురు లిక్విడ్ గంజాయితో పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు. నిందితులు గుంటూరు జిల్లాకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరి నుంచి 950 ఎంఎల్ ద్రవ గంజాయి, గంజాయి రెండు కిలోలు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ సాయి కుమార్ తెలిపారు.

నేత్రపర్వం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణం అనంతరం శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడు



గోవింద నామస్మరణలో భక్తజనం

- కనులారా వీక్షించిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మారుమోగిన లాగరాయి
- ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీటీడీ కల్యాణ ప్రాజెక్టు ఈవో విజయలక్ష్మి
- తిలకించిన ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: లాగరాయి.. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుని కల్యాణ వేడుకకు వేదిక అయింది. గోవిందనామస్మరణతో మార్మోగింది. తరలివచ్చిన వేలాది మంది భక్తజనంతో పులకించిపోయింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని వివాహ వేడుకను భక్తజనం కనులారా వీక్షించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆద్యంతం తిలకించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆచార సంప్రదాయ ప్రకారం వేదమంత్రాలు, హోమాల నడుమ ప్రధాన అర్చకుడు ఎ.బాలాజీస్వామి శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారు, అమ్మవార్లకు ధరింపజేసే పట్టు వస్త్రాలను, పూలమాలలు, కంకణాలు, మంగళసూత్రాలను భక్తులకు చూపుతూ కల్యాణ వేడుకను నిర్వహించారు. వివాహ వేడుకలో తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ మిరియాల గణలక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, సత్యనారాయణ, సవిరెల చంద్రుడు తదితరులు పాల్గొన్నారు. టీటీడీ కల్యాణ ప్రాజెక్టు ఈవో విజయలక్ష్మి గత మూడు రోజులుగా ఇక్కడే ఉండి వేడుక ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ చలుమర్తి విశ్వనాథరెడ్డి, చోడి సత్యనారాయణ, సీహెచ్. శివకృష్ణ, తమ్మారావు, నమ్మి అప్పారావు, తాము సూరిబాబు, సత్యనారాయణ తదితరులు విజయవంతానికి కృషి చేశారు.



స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

హైడ్రోపవర్ ప్రాజెక్టుతో యువతకు ఉపాధి



హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- విద్యుత్ అవసరాలు తీర్చేందుకు నిర్మాణం
- 32 గ్రామాలు ఖాళీ చేయాలన్నది తప్పుడు ప్రచారం
- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- ప్రజాప్రతినిధులతో సమావేశం
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సందేహాలు నివృత్తి చేసిన నెడ్‌క్యాప్

పాడేరు రూరల్ : ఎర్రవరంలో హైడ్రోపవర్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రజల విద్యుత్ అవసరాలు తీరడమే కాకుండా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం పాడేరు పీఎంఆర్‌సీ భవనంలో నెడ్‌క్యాప్ ఉన్నతాధికారులు కొయ్యూరు, చింతపల్లి ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల 32 గ్రామాలు ఖాళీ చేయాలని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. నెడ్‌క్యాప్ అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల మేనేజర్ జి.సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సందేహాలను నివృత్తి చేశారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు చోట్ల 6,600 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల హైడ్రోపవర్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని వివరించారు. ఎర్రవరం హైడ్రోపవర్ విద్యుత్ ప్రాజెక్టు వల్ల 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. డీపీఆర్ నివేదిక తయారీకి నెడ్‌క్యాప్ యాజమాన్య సంస్థకు నోడల్ ఏజెన్సీగా నియమించిందని చెప్పారు. ఎర్రవరం ప్రాజెక్టు వల్ల 32 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, వాటిని ఖాళీ చేయాలని వస్తున్న వార్తలు ఎటువంటి నిజం లేదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల కేవలం సీనయ్యకొండ అనే ఒక చిన్న గ్రామం మాత్రమే పరివాహక ప్రాంతం పరిధిలో వస్తుందన్నారు. ఆ గ్రామంలో కేవలం పది ఇళ్లు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైతులకు ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం నష్ట పరిహారం అందుతుందన్నారు. సీఎస్సార్ గ్రాంటు ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. నెడ్‌క్యాప్ విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్‌రాజు, ఆర్‌యూ అసోసియేట్స్ ప్రాజెక్టు ఇంజినీర్ నాగేంద్రరెడ్డి, పి.పాండురంగ, కొయ్యూరు, చింతపల్లి ఎంపీపీలు బడుగు రమేష్, కోరాబు అనూషదేవి, కొయ్యూరు, చింతపల్లి జెడ్పీటీసీలు వారా నూకరాజు, పోతురాజు బాలయ్యదొర, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వంజంగి హిల్స్‌పై రాత్రి బస నిషేధం

- అనుమతి లేదని ఎంపీడీవో స్పష్టీకరణ
- ఉల్లంఘిస్తే కేసులు



వంజంగి కొండపై మాట్లాడుతున్న ఎంపీడీవో

పాడేరు రూరల్ : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి కొండపై పర్యాటకుల రాత్రి బసకు ఎటువంటి అనుమతులు లేవని ఎంపీడీవో కె. సాయిన వీస్ స్పష్టం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి ఆయన స్థానిక గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి వంజంగి కొండను సందర్శించారు. రాత్రి పూట వచ్చే పర్యాటకులతో మాట్లాడి వారిని తిరిగి పంపించి ఉదయం రావాలని చెప్పమని స్థానికులకు సూచించారు. రాత్రి వేళల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలపాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పరార్యటకులు ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి రాత్రి బస చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సందర్శకులకు ఉదయం మాత్రమే అనుమతి ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

మత్తు వైద్యుడు రమేష్ బాధ్యతల స్వీకరణ



చింతపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మత్తు వైద్యుడు కె.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, సుదాశారద, ఎల్‌టీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ ఆశయ సాధనకు కృషి

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

పాడేరు రూరల్ : గిరిజన ఉద్యమ వీరుడు కోమరం భీమ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని తలారిసింగిలోని నివాసంలో ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గొండు గిరిజన తెగకు చెందిన కోమరం భీం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. పశువుల కాపరులకు విధించిన సుంకానికి వ్యతిరేకంగా భూమి, అడవి, నీరు మాదే అనే నినాదంతో గర్జించి వీరమరణం పొందిన పోరాట యోధుడన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, సర్పంచ్‌లు సీదరి రాంబాబు, వనుగు బసవన్నదొర, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, సల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణ పాత్రుడు, కె. నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీలు ఎస్వీ రమణమూర్తి, సీదరి మంగ్లన్నదొర, కన్నపాత్రుడు, దశమూర్తి, చిన్నీ, సుశీల పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచేలా కృషి



ఢిల్లీలో స్వర్ణం అందుకుంటున్న గిరిజన విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పీవో సూరజ్ గనోరే

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచాలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. బందపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థి కోసు సర్విన్‌బాబుదొర ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రోప్ స్కిపింగ్‌లో డబుల్ అండర్ రిలే ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం పీడీ కె. తిరుపతిరావు, హెచ్‌ఎం శ్రీరాములుతో కలిసి విద్యార్థి పీవోను మర్యాదపూర్వకంగా కలిశాడు. అతనిని అభినందించిన అనంతరం పీవో మాట్లాడారు. మరింత రాణించేందుకు అవసరమైన శిక్షణకు సహకారం అందిస్తామన్నారు. ముసురుమిల్లి స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన పరికరాలకు ప్రతిపాదనలు పంపించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో గిరి విద్యార్థులు ప్రతిభ కనబరిచేవిధంగా తీర్చిదిద్దాలని సూచించారు. స్వర్ణ పతకం సాధించిన విద్యార్థిని డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో రామతులసి, లైజన్ అధికారి బీఎస్ కుమార్, ఎంపీటీసీ సాయిబాబా, ఏఎంవోలు శ్రీనివాసరావులు అభినందించారు.

పర్యాటకుల తాకిడి

వరుస సెలవు దినాలు కావడంతో తరలివస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు : జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల వద్ద సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులంతా రంపచోడవరం, పాడేరు డివిజన్ల పరిధిలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు తరలివస్తున్నారు. అనంతగిరిలోని బొర్రాగుహలు, తైడా జంగిల్ బెల్స్, కటికి జలపాతాలతో పాటు డముకు, గాలికొండ వ్యూపాయింట్లు, సుంకరమెట్ట కాఫీ తోటలను సందర్శించారు. అరకులోని పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, రణజిల్లెడ జలపాతం, పెదలబుడు గిరి గ్రామ దర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, హుకుంపేటలోని మత్స్యగుండం, జెండాకొండకు తరలివచ్చారు. వంజంగి, దల్లాపల్లి హిల్స్ , పాడేరు ఘాట్‌లోని కాఫీ తోటలు, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద రద్దీ నెలకొంది.

రా.. రమ్మని..

రంప మన్యానికి రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఈ ప్రాంతంలో సినిమాలు, సీరియల్స్ చిత్రీకరిస్తుండటంతో షూటింగ్ స్పాట్‌గా మారిపోయింది. సన్నివేశాల్లోని అందాలను తిలకించేందుకు దూర ప్రాంతాలనుంచి ప్రకృతి ప్రేమికులు తరలివస్తున్నారు. తనివితీరా ఆస్వాదించి మంత్రముగ్ధులవుతున్నారు. మరుపురాని అనుభూతిని పొందుతున్నారు. ఇలా రోజురోజుకు క్రేజ్ పెరిగిపోతోంది.

- రంప మన్యం...అందాల మహోదయం
- షూటింగ్ స్పాట్‌గా ప్రాచుర్యం
- సినిమాలు, సీరియల్స్ చిత్రీకరణ
- ప్రకృతిని తిలకించేందుకు తరలివస్తున్న పర్యాటకులు



సినిమా షూటింగ్‌లకు నెలవుగా గుడిస ప్రకృతి అందాలు

చింతూరు: మన్యం అందాలు కట్టిపడేస్తూ రా..రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఇక్కడి అందాలను సినిమాలు, సీరియల్స్‌లో చిత్రీకరించేందుకు సినీ, బుల్లి తెర దర్శక నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రంప మన్యం షూటింగ్ స్పాట్‌గా మారిపోయింది. ఈ ప్రాంతంలో చిత్రీకరించిన సినిమాల ప్రభావం వల్ల పర్యాటకుల రాక కూడా గణనీయంగా పెరిగింది.

- ఎన్నో రికార్డులు తిరగరాసిన అల్లు అర్జున్ నటించిన పుష్ప వంటి పాన్ ఇండియా సినిమా సైతం ఈ ప్రాంతంలోనే చిత్రీకరించారు. దీంతోపాటు బుల్లితెర సీరియల్స్, నేషనల్ లెవెల్ ఫొటో వర్క్‌షాప్‌లు కూడా ఇక్కడి మన్యం అందాల మాటున చిత్రీకరిస్తున్నారు.

షూటింగ్ స్పాట్‌లివే..

- రంపచోడవరం ప్రాంతంలో రంప, వాడపల్లి రోడ్, మారేడుమిల్లి ప్రాంతంలో గుడిస, దమ్ముదారవాడ జలపాతం, పాములేరు వాగు, చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్, వ్యూ పాయింట్, ఉక్కులూరు జంక్షన్, కాఫీ తోటల్లో షూటింగ్‌లు జరుగుతుంటాయి. చింతూరు ప్రాంతంలో ఫోర్‌బే రిజర్వాయర్, పొల్లూరు జలపాతం, పవర్ కెనాల్ అక్విడెక్ట్, ధారాలమ్మ గుడి తదితర ప్రాంతాల్లో సినిమా, సీరియల్స్ షూటింగ్‌లు జరుగుతుంటాయి.



సినిమా షూటింగ్‌లో అల్లరి నరేష్ (ఫైల్)

పుష్ప సినిమాతో ఒక్కసారిగా క్రేజ్

మారేడుమిల్లి, చింతూరు మండలాల్లో చిత్రీకరించిన పుష్ప సినిమా సూపర్‌హిట్ కావడంతో రంప మన్యానికి ఒక్కసారిగా క్రేజ్ పెరిగిపోయింది. మారేడుమిల్లి మండలంలోని గుడిస, చింతూరు మండలంలోని ఫోర్‌బై ప్రాంతంలో ఈ సినిమా చిత్రీకరణ అధికశాతం జరిగింది.

- ఎర్రచందనం స్మగ్లింగ్ సమయంలో గుడిస ప్రాంతంలోని వంపులు తిరిగే ఎర్రటి ఘాట్‌రోడ్‌పై వాహనాలు వెళ్లే దృశ్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చింతూరు మండలం ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద సామీ, సామీ సాంగ్‌తో పాటు హీరో, హీరోయిన్లతో కొన్ని సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. ఈ ప్రాంతాల్లో నిత్యం సినిమా, సీరియల్స్ షూటింగ్‌లు జరుగుతుండడంతో స్థానిక యువతకు సైతం క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటించే అవకాశం లభిస్తోంది.

పెరుగుతున్న సందర్శకుల రాక

మన్యం ప్రాంతంలో తీసిన చాలా సినిమాలు సూపర్‌హిట్ అవుతుండడంతో వాటిలో ఈ ప్రాంతంలో చిత్రీకరించిన అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దీంతో మారేడుమిల్లి, చింతూరు మండలాల్లో ఇటీవల పర్యాటకం ఊహించని స్థాయిలో పెరిగింది. ప్రధానంగా పుష్ప చిత్రీకరించిన గుడిస, ఫోర్‌బై రిజర్వాయర్ ప్రాంతానికి పర్యాటకులు అధికంగా వస్తున్నారు. అందులో చిత్రీకరించిన సన్నివేశాల ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఫొటోలు దిగడంతో పాటు కొంతమంది యువత తమ పెళ్లిళ్లకు ఫొటోషూట్ కూడా ఈ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు.

సినిమాలు.. సీరియల్స్ ఇవే..

ఇప్పటివరకు రంపచోడవరం ప్రాంతంలో పుష్ప, ఎర్రసైన్యం, చీమలదండు, మారేడుమిల్లి ప్రాంతంలో పుష్ప, ఆచార్య, 100 పర్సెంట్ లవ్, లెజెండ్, నేలటిక్కెట్, ఇట్లు.. మారేడుమిల్లి ప్రజానీకం సినిమాల్లో ఎక్కువ సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. కార్తీకదీపం, స్వాతిముత్యాలు, మల్లెపూలు వంటి సీరియల్స్ నిర్మించారు. చింతూరు ఏజన్సీలో పుష్ప, దొంగలబండి, గరుడవేగ, పీపుల్స్ ఎన్‌కౌంటర్ సినిమాలు, మల్లి, గంగోత్రి వంటి సీరియల్స్‌ను చిత్రీకరించారు.

ఫొటోషూట్‌కు ఎంతో అనుకూలం



చింతూరు, మారేడుమిల్లిలోని మన్యం ప్రాంతాలు ఫొటోషూట్‌కు ఎంతో అనుకూలం. అటవీ ప్రాంతంలో ఎన్నో మంచి లొకేషన్లు ఉన్నాయి. సినిమా, సీరియల్ దర్శకులు ఇక్కడ షూటింగులు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు. 'మా' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఇక్కడ జాతీయస్థాయిలో తొమ్మిది ఫొటో వర్క్‌షాప్‌లు నిర్వహించాం. – నాగరాజు దేవర, నిర్వాహకుడు, ఖమ్మం ఫొటోఆర్ట్స్ ఆర్గనైజేషన్

జోరుగా...హుషారుగా



వ్యవసాయ పనుల్లో గిరిజన రైతులు

- వాతావరణం అనుకూలం
- సాగు పనుల్లో రైతులు నిమగ్నం

కొయ్యూరు: గడచిన రెండు రోజులుగా విస్తారంగా ఎండలు కాయడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు నెల రోజుల నుంచి వర్షాలు కురవడంతో రైతులు వరికి ఎరువులు లేదా పురుగు మందులు పిచికారీ చేసేందుకు అవకాశం లేకపోయింది. ఎరువులు వేసినా లేదా పిచికారీ చేసినా రెండు రోజుల వరకు ఎండలు కాయాలి. లేకుంటే వేసినా ఫలితం ఉండదు. వర్షాలు కురిసినప్పుడు ఎరువులు వేస్తే వర్షం నీటితో వేసిన ఎరువులు కొట్టుకుపోతాయి. అదే విధంగా పిచికారి చేసినా వర్షానికి పట్టకుండా చినుకులకు మందు దుబ్బు నుంచి జారిపోతుంది. దీంతో రైతులు నెల రోజుల నుంచి ఎరువులు వేసి పరుగుమందులు పిచికారి చేసేందుకు ఎదురు చూస్తున్నారు.కొన్ని చోట్ల వరి పొట్టదశలో ఉంది. ఈ సమయంలో నీరు ఎక్కువ అవసరం ఉంటుంది. దీనిపై ఏవో కృష్ణవేణిని సంప్రదిస్తే వర్షాలు ఎక్కువ రోజులు కురిసినట్టు చెప్పారు. రైతులకు వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సలహాలు ఇవ్వాలని సచివాలయాల సహాయకులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పొట్టదశలో ఉంటే చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరిస్తామని చెప్పారు.వర్షాలు కురవకుండా ఉంటే నెల రోజుల్లో కొన్నిచోట్ల వరి కోతకు వస్తుందన్నారు.

మన్యంలో టీడీపీకి చరమగీతం

పెదబయలు: మన్యంలో టీడీపీకి చరమగీతం తప్పదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని అలుగులపుట్టు పంచాయతీ జంగంపుట్టు గ్రామం నుంచి శనివారం 30 టీడీపీ కటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులకు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, జగనన్న సంక్షేమ పాలన చూసి పార్టీలో చేరామని, పార్టీలో చేరిన టీడీపీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు గిరిజన ప్రాంతంలో టీడీపీ కనుమరగవుతోందని, గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ పక్షాన ఉండాలని నిర్ణయించుకున్నారని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఏజెన్సీలో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, రాష్ట్ర అగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ సన్యాసి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై కొనసాగిన విచారణ

చింతూరు: డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై నలుగురు సభ్యుల కమిటీ రెండో రోజైన శనివారం కూడా విచారణ చేపట్టింది. మండలంలోని అల్లిగూడెం, రత్నాపురం, ఎర్రంపేటలో పాడేరు డీపీఎం వైకుంఠరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రంపేటలో-22, రత్నాపురంలో-8, అల్లిగూడెంలో-4 గ్రూపులకు చెందిన మహిళా సమాఖ్య సభ్యుల నుంచి వారు వివరాలు సేకరించారు. మూడు గ్రామాలకు చెందిన మహిళా సమాఖ్య సభ్యులకు సంబంధించి 60 మంది నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు తీసుకున్నామని, ఆధారలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని డీపీఎం వైకుంఠరావు తెలిపారు. సర్పంచ్ కారం కన్నారావు, కమిటీ సభ్యులు దాసు, రఘు, రాజుబాబు పాల్గొన్నారు.

కట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య



మృతురాలు అభినవ్య

.భర్త వేధింపులకు మనస్థాపం చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలివి. ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు గ్రామానికి చెందిన తరిగొప్పల సీతారామరాజుతో అదే జిల్లాకు చెందిన ఎ.కోడూరుకు చెందిన అభినవ్యతో 2020లో వివాహం జరిగింది. వీరిద్దరూ కొంత కాలం అక్కడే నివసించారు. వివాహ సమయంలో కట్నం నిమిత్తం 5 లక్షల రూపాయిలు, 20 కాసుల బంగారం ఇచ్చారు. అనంతరం వీరు పాయకరావుపేటకు నివాసం వచ్చారు. సీతారామరాజు హెట్రో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా తరచూ కట్నం కోసం సీతారామరాజు భార్య అభినవ్యను ఇబ్బంది పెట్టడంతో మరలా రూ. 2 లక్షలు ఇచ్చారు. భర్త పెట్టే ఇబ్బందులు భరించలేక మనస్థాపానికి గురై అభినవ్య (22) శుక్రవారం రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చేందింది. దీనిపై అభినవ్య తండ్రి వేముల గురున్నాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మహిళా వలంటీర్ అనుమానాస్పద మృతి



నూర్జహాన్ (ఫైల్)

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న తొమ్మిది నెలల బాలింత శనివారం అనుమానస్పదంగా మృతి చెందింది. ఉరి వేసుకుని తన భార్య షేక్ నూర్జహాన్ మృతి చెందిందని భర్త ఇస్మాయేల్ చెబుతుండగా, మరో వైపు తమ కుమార్తెను హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. గోవాడ- వెంకన్నపాలెం మార్గంలో మసీదు సమీపంలో షేక్ ఇస్మాయేల్, షేక్ నూర్జహాన్ దంపతులు నివసిస్తున్నారు. ఇస్మాయేల్ పరవాడ ఫార్మ కంపెనీలో పనిచేస్తున్నాడు. మృతురాలు వెంకన్నపాలెం పంచాయతీలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. వీరికి మూడేళ్ళ బాబు, తొమ్మిదో నెల వయసు పాప ఉన్నారు. శనివారం ఎప్పటిలాగే ఇస్మాయేల్ ఫార్మా కంపెనీలో పనిచేయడానికి వెళ్లి సాయంత్రం 5గంటల సమయంలో విధుల నుంచి తిరిగి ఇంటికి చేరాడు. తాను ఇంటికి వెళ్లి చూసే సరికి తన భార్య ఉరి వేసుకుని చనిపోయినట్టు చెబుతున్నాడు. తన భార్యకు ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయని, ఆ బాధ తట్టుకోలేక ఉరి వేసుకుందని చెబుతున్నాడు. తెల్లవారుజామున తాను ఫార్మా కంపెనీకి వెళ్లిపోయానని, తన తల్లిదండ్రులు తమ బంధువుల ఇంట నామకరణం ఉండడంతో తమ కుమారుడిని కూడా వెంట తీసుకుని అనకాపల్లి వెళ్లారని అంటున్నాడు. ఇదిలా ఉండగా తమ కుమార్తెను అత్త, మామలే హత్య చేసారని, 25 ఏళ్ళ తమ కుమార్తెకు ఆరోగ్యపరమైన సమస్యలు లేవని మృతురాలి తల్లిదండ్రులు షేక్ ఇషాక్ మదీనా, షేక్ అమీనాలు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న చోడవరం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి.యమున తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త, అత్త, మామలను మూడేళ్ల బాబు నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

వివాహిత ఆత్మహత్య

యలమంచిలి: కుటుంబ కలహాలు ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏటికొప్పాక గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. ఏటికొప్పాక బండిమాంబ గుడి వద్ద గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్న కాకినాడ జిల్లా ఏలేశ్వరంకు చెందిన దేగల నూకరత్నం (48) కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో 18న పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకోగా ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 21న మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరకు సీఐ దేముడుబాబు, ఎస్‌ఐ, రిసార్టుల ప్రతినిధులు

అరకులోయ: టూరిజం సీజన్ ప్రారంభం కావడంతో పట్టణంలోని లాడ్జీలు, రిసార్టుల యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యాటకులకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని అరకు సీఐ జి.దేముడుబాబు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో భద్రత సూచనలతో పోలీసుశాఖ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లాడ్జీలు, హోటళ్లు, రిసార్టుల వద్ద పర్యాటకుల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా యాజమాన్యాలకు సూచించారు. ప్రతి ఇంటి యజమాని కూడా దొంగతనాలు, ఇతర సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఎస్‌ఐ ఆర్.సంతోష్, తహసీల్దార్, ఎంపీడీవో, ఏవో, లాడ్జీలు, రిసార్టుల యాజమాన్యం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఏపీపీఎస్సీ పరీక్షల్లో ప్రిలిమినరీ అర్హత సాధించిన గ్రూప్-4 అభ్యర్థుల మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును పెంచినట్టు ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన గడువు ఈ నెల 22వ తేదీతో ముగియడంతో, ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు తెలియజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 రోజుల ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు వివరించారు. అర్హులైన అభ్యర్థులు 10వ తరగతితో పాటు డిగ్రీ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డ్, ప్రిలిమినరీ పరీక్ష హాల్‌టికెట్, సాధించిన మార్కుల వివరాలు, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో నేరుగా లేదా, పోస్టు ద్వారా ఈ నెల 31వ తేదీ లోపు అందజేయాలని సూచించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: భర్త అదృశ్యంపై భార్య పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ వెంకన్న చెప్పారు. పరశురామ్‌పేటకు చెందిన గోవిందరావు పనుల నిమిత్తం నాలుగు నెలలు క్రితం విజయవాడ కు వెళ్లాడు. గోవిందరావుకు ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ రావడంతో ఆయన భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ

డుంబ్రిగుడ: కోల్లాపుట్టు పంచాయతీ మునిగుడ గ్రామానికి చెందిన మత్స్యరాజు, భార్గవి దంపతుల ఐదు నెలల చిన్నారి ఈ నెల 21న మృతి చెందడంతో ఈ సమాచారం తెలుసుకున్న సీడీపీవో నీలిమ వెంటనే శనివారం గ్రామంలో సందర్శించారు. చిన్నారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, రక్తహీనత లేకుండా పౌష్టికాహారం రోజూ అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించారు. శిశు మరణాలు జరగకుండా చూసుకోవాలని ఆమె చెప్పారు. గర్భిణులు ఆస్పత్రిల్లోనే ప్రసవాలు చేసుకోనేలా అవగాహన కల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు, బియ్యం అందజేస్తున్న కొములునాయుడు

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ బోడుగుడ గ్రామానికి చెందిన శోభ పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములు నాయుడు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.1000ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు సహాయ సహకారలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ హరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



వ్యర్థాలను జేసీబీ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకపోయాయి. చెత్త తొలగింపు పనులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం అంజిబాబు ముందుకొచ్చారు. ఈ మేరకు జేసీబీ సాయంతో శనివారం చెత్త తొలగింపు పనులు చేయించారు. గ్రామంలో రహదారికి ఇరువైపులా పేరుపోయిన చెత్త, వ్యర్థాలను జేసీబీతో ఊడ్చి గ్రామ శివారులో డంపింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగునకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

రంపచోడవరం: చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది చుక్కా సంతోష్‌కుమార్ అన్నారు. రంపచోడవరం బిఎస్ఆర్ కళాశాలలో శనివారం రంపచోడవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ జజ్జువరపు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా గ్రామస్థాయిలో అందర్ని చైతన్య చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యాహక్కు చట్టం, గృహ హింస, , మావన హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చీడిపాలెం గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

- గడప గడపకు మన ప్రభుత్వంలో బ్రహ్మరథం పట్టిన గిరిజనులు
- పెదబయలు, గంగవరం మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

పెదబయలు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలు మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ సింధిపుట్టు, లకేపుట్టు, జంగంపుట్టు, అల్లంపుట్టు, కొత్తుపుట్టు గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 217 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులను అప్యాయంగా పలకరిస్తూ...అమ్మా.. మీ పిల్లలు బాగా చదువుకుంటున్నారా?.. అమ్మఒడి వస్తుందా?.. అవ్వా.. మీకు ఒకటో తారీఖు పింఛన్ అందుతుందా?...రైతు భరోసా వస్తుందా?... అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

అభివృద్ధి పథంలో మన్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, గతంలో ఎన్నాడూ లేని విధంగా గిరిజన ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో అంతులేని ప్రజాధారణను పొందుతూ తమ పాలనకు అన్ని వర్గాల ప్రజలు మన్ననలు పొందుతున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, రాష్ట్ర అగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ వి.సన్యాసి, వైస్ ఎంపీపీ కె.రాజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనంద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.సురేష్, సర్పంచ్‌లు చిన్నారావు, మత్స్యలింగం, నాయకులు సూర్యనారాయణ, సూరయ్య, ధనలక్ష్మి, బాలరాజు, రామారావు, అప్పన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గంగవరం మండలం జడేరు గ్రామ సచివాలయం పరిధిలో చీడిపాలెం, చినవీధి, చిన ఏటిపల్లి, ఏటిపల్లి గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 590 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి అప్యాయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. గిరిజన విద్య, వైద్యానికి, రైతుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని , ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏటిపల్లి, చీడిపాలెం గ్రామాల్లో స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చీడిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం, వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని వాల్మీకి కులస్తులు కోరారు. ప్రతీ గ్రామంలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా జడేరు నేసం వారి వీధిలో రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి శంఖుస్థాపన చేశారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, వైస్ ఎంపీపీ కె.రామతులసి, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు మల్లికార్జునదొర, రామలక్ష్మి, మరిడమ్మ, కామరాజు,

అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, మండల పార్టీ ఇన్‌చార్జి రఘునాథ్, నాయకులు ఏసు, బాబీ, సత్తిబాబు, రాఘవరెడ్డి, బాబీ, చిన్నయ్య, ఎంఆర్‌ఐ జిలానీ, మండల పరిషత్ ఏవో సిద్దేశ్వర రావు, జేఈ రమణ తదితరులు పాల్గొన్నారు.


సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



ఓటరు నమోదు దరఖాస్తులను తహసీల్దార్ నర్సమ్మకు అందజేస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని పలు పంచాయతీలు, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు దరఖాస్తులను అందజేశారు. అనంతరం పూర్తి సమాచారంతో కూడిన అయా దరఖాస్తులను తహసీల్దార్ నర్సమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇందుకోసం పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు గంగాధర్, నీలకంఠం, నాయకులు అప్పారావు, తిరుపతి, రాంప్రసాద్, పులిరాజు, దాసు, ప్రసాద్, పెదబాబు తదితరులు పాల్గొన్నారు

పొంచి ఉన్న ప్రమాదం



కాకరపాడు మలుపువద్ద ఒరిగిపోయిన చింతచెట్టు

కొయ్యూరు: కాకరపాడు వంతెన సమీపంలో ఉన్న మలుపు వద్ద ఒరిగిపోయి ఉన్న రెండు చింతచెట్లు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాటి వేర్లు కూడా కొంత మేరకు పట్టును కోల్పోయాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆయా చెట్లను తొలగిస్తామని గతంలో అధికారులు ప్రకటించినా ఇప్పటి వరకు చేపట్టలేదని, ప్రమాదం పొంచి ఉందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనచోదకులు తదితరులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి రోడ్డు సమస్య



ఐనాడ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో సాయి నవీన్

పాడేరు రూరల్ : మండలంలోని మారుమూల ఐనాడ గ్రామంలో నెలకొన్న రోడ్డు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని పాడేరు ఎంపీడీవో కె.సాయి నవీన్ అన్నారు. ఆయన మండలంలోని అతి మారుమూల ఐనాడ పంచాయతీను సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈదులపాలెం నుంచి ఐనాడ వచ్చే ప్రధాన రహదారి పలుచోట్ల కోతకు గురైందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్, ఎంపీటీసీలు ఎంపీడీవో సాయి నవీన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న మన బడి నాడు-నేడు పనులను ఎంపీడీవో సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

విద్యాలయాల్లో సమస్యలపై వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఎటపాక: మండలంలోని నెల్లిపాక జూనియర్ కాలేజీ, పలు పాఠశాలలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీ, కేఎస్ పురం, నల్లకుంట ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెల్లిపాక కాలేజీలో లెక్చరర్ల కొరత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. మాధవరావు, బాలకృష్ణ తదితరులున్నారు.

మ్యుటేషన్‌పై రైతులకు అవగాహన



భీంపోలులో మ్యుటేషన్ సదస్సుకు హాజరైన అధికారులు, రైతులు

అనంతగిరి: మండలంలోని భీంపోలు పంచాయతీ కేంద్రంలో రెవెన్యూ అధికారులు శనివారం భూముల మ్యుటేషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మ్యుటేషన్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రెవెన్యూ అధికారులు వివరాంచారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అశోక్‌కుమార్ మాట్లాడుతూ భూములు మ్యుటేషన్ ద్వారా తాత, తండ్రుల పేరిట ఉన్న భూములు మార్చుకోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. రైతులు అంతా మ్యుటేషన్‌కు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వైస్ సర్పంచ్ అప్పలకొండ, వార్డు మెంబర్ అప్పన్న, మాజీ సర్పంచ్ చిన్నయ, సచివాలయ వీఆర్‌వో నంద తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



ఎదపాడులో భూములు రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి



సొవ్వా పంచాయతీలో రీసర్వేను చేస్తున్న అధికారులు



చినగార్లపాడులో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఆర్ఐ జిలానీ

జి.మాడుగుల: మండలంలో పెదపాడు గ్రామంలో భూముల రీసర్వే ముమ్మరంగా చేపడుతున్నట్టు తహసీల్దార్ కె.అప్పలస్వామి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. దీంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రీసర్వేకు సిబ్బందికి రైతులు సహకరించాలని ఆయన సూచించారు.

డుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ కిరిడివలస గ్రామంలో వీఆర్వో శెట్టి రవి ఆధ్వర్యంలో రీ సర్వే నిర్వహించారు. కిరిడివలసలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా చేపడుతున్న రీసర్వే వేగవంతం చేస్తున్నామన్నారు. రీసర్వేప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీఆర్వో రవి, సర్వేయర్లు, ఫారెస్టు అధికారులు శివ, గంగాధర్, సర్పంచ్ సొయిత, నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: చినగార్లపాడు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను తహసీల్దార్ శ్రీమన్నారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జిలానీ భాషా శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భూముల రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా చేస్తున్నామని తహసీల్దార్ శ్రీమన్నారాయణ చెప్పారు. రైతులు తమ వారసులకు పంచిన భూములకు మ్యుటేషన్లు చేయించుకోవాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియతో భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకన్నదొర, రామలక్ష్మి, సర్వేయర్లు భాస్కర్ ,చరణ్, రాంబాబు, బాపిరాజు, వాసు తదితరులున్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న అరకు ఎస్ఐ సంతోష్

సాక్షి, పాడేరు : దీపావళి పండగ సందర్భంగా బాణసంచా విక్రయాలకు దుకాణాదారులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అరకులోయ ఎస్ఐ ఆర్.సంతోష్ కోరారు. దుకాణదారులు సబ్ కలెక్టర్, ఫైర్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అరకులోయ పట్టణానికి సంబంధించి ఎన్‌టీఆర్ మైదానంలో మందుగుండు సామగ్రి విక్రయించేందుకు ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. మందుగుండు సామాగ్రి విక్రయించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాజవొమ్మంగి: రానున్న దీపావళి పర్వదినం సందర్భంగా అనుమతులు లేకుండా బాణాసంచా సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జడ్డంగి ఎస్ఐ షరీఫ్ హెచ్చరించారు. మందుగుండు సామగ్రి తయారు చేసినా నేరమే అన్నారు.

కొమరం భీమ్ జయంతి



కొమరం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

అడ్డతీగల: ఆదివాసీ విప్లవ వీరుడు కొమరం భీమ్ జయంతిని అడ్డతీగలలో శనివారం నిర్వహించారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దొరబాబు, జిల్లా వాల్మీకి సంఘం సంయుక్త కార్యదర్శి చిన్నిబాబు తదితరుల ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఓ కార్యాలయం వద్ద వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల అణిచివేతకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన విప్లవ కెరటం కొమరం భీమ్ అని కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వై.రామవరం: కె.యర్రగొండ గ్రామంలో కొమరమ్ భీమ్ జయంతి వేడుకలను ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కొమరమ్ భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ లలిత, సర్పంచ్ కొములు

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వైస్ ఎంపీపీ పంచడి లలిత అన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు కొర్రాయి పంచాయతీలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా కొర్రాయి పంచాయతీ జాకరవలసలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, గత్తరజిల్లెడ గ్రామ సమీపంలో గల చంపగుడలో రూ.4లక్షలతో సీసీ రోడ్డు, కొర్రాయి పంచాయతీ కేంద్రంలో రూ,3లక్షలతో తాగునీటి కొళాయి పైపులైన్, చిన్నఅంజోడ గ్రామంలో రూ,4.50లక్షలతో సీసీ రోడ్డు, బరియాకాలు గ్రామానికి రూ.3.50లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీ అభివృద్ధికి పెద్దపీట వేశారని, శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. సర్పంచ్ కొములు, వార్డు సభ్యులు జయరాం,బుద్దు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్, లంబన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశు సంతల రద్దుకు రైతులు సహకరించాలి



లంపీ వ్యాధి తీవ్రతపై రైతులకు వివరిస్తున్న పశు వైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: లంపీ వ్యాధితో పశు సంతలు రద్దు చేయడం జరిగిందని, రైతులు అంతా సహకరించాలని కిలగాడ పశు వైద్యాధికారిణి ఎం.సౌజన్యదేవి అన్నారు. పశువుల వారపు సంతను రద్దు చేసినట్టు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసి, ప్రచారం నిర్వహించినా కొంత మంది మండల కేంద్రంలో శనివారం పశువుల సంతను నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో కిలగాడ పశు వైద్యాధికారిణి సౌజన్యదేవి తన సిబ్బందితో అక్కడకు వెళ్లి రైతులకు, వ్యాపారులకు లంపీ వ్యాధి తీవ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సౌజన్యదేవి మాట్లాడుతూ లంపీ వ్యాధి గిరిజన ప్రాంతంలో అధికంగా ప్రబలే అవకాశం ఉందని, రైతులంతా పశు వైద్య సిబ్బందికి సహకరించి గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ పశువులకు వేయించాలని సూచించారు. కొద్ది రోజులు పాటు పశువులను కొనడం, అమ్మడం చేయవద్దని, అప్పుడే లంపీ వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. సంతలు నిర్వహిస్తే పోలీసుశాఖకు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు. సిబ్బంది ధర్మారావు, రఘునాథ్, రాజుబాబు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు, ఐటీడీఏపీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు శనివారం పాడేరు పట్టణంలోని బాలసదన్ హోం, గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో విద్యార్థులకు ఉచితంగా ఐ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 145 మంది విద్యార్థులు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కంటి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, బాలసదన్ నిర్వాహకురాలు హేమ వైద్య శిబిరం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, జిల్లా కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, కోశాధికారి అప్పారావు, లోహితాస్, సాయికుమార్, సోములు, నాయుడు, ఏఎస్ఎం భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాపై విస్తృత ప్రచారం



పోస్టల్ బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏబీపీఎం మురళీ తదితరులు

ముంచంగిపుట్టు: తపాల శాఖ బీమా పథకంతో ప్రతి వ్యక్తి జీవితం ధీమాగా ఉంటుందని బీపీఎంలు, ఏబీపీఎంలు శనివారం వారపు సంతలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇందులో భాగంగా రూ.399 ప్రీమియం చెల్లించి ఏడాది పాటు ప్రమాద బీమాను పొందవచ్చని, బీమా చేసిన వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల వరకు బీమా ఉంటుందని, అనారోగ్యానికి గురైతే ఆస్పత్రిలో చికిత్సకు ఇన్సూరెన్స్ వర్తిస్తోందని అవగాహన కల్పించారు. పోస్టల్ బీమాపై కరపత్రాలను పంపిణీ చేశారు. బీపీఎంలు, ఏబీపీఎంలు లోహితాష్, గంగారావు, ఉక్రేషన్, సావిత్రి, మురళీ, ప్రసాద్ రావు, బాలన్నలు పాల్గొన్నారు.

ఆదివాసీలను ఆదుకోవాలి

హుకుంపేట/వై.రామవరం: గిరిజన సంఘం, ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో హుకుంపేట, వై.రామవరం మండలాల్లో శనివారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోయ, వాల్మీకీలను ఎస్టీ జాబితాల్లో చేర్చే నిర్ణయంతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు.